## క్లుప్తంగా

### ఆత్మీయ కలయిక



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జానకీరామ్ కుటుంబ సభ్యులు. చిత్రంలో వాసుపల్లి, జాన్‌వెస్లీ

**దాబాగార్డెన్స్:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు, 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ కుటుంబ సభ్యులతో మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు పార్టీ గురించి చర్చించారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విషయంలో కూటమి ప్రభుత్వం కుట్రలు.. కుతంత్రాలతో అవిశ్వాసం పెట్టి దించేసిన సమయంలో ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా వైఎస్సార్‌సీపీ తరఫునే నిలవడంపై తనను జగన్ అభినందించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు బొల్లవరపు జాన్‌వెస్లీ నేతృత్వంలో చెన్నా కుటుంబ సభ్యులు జగన్ మోహన్‌రెడ్డిని కలిసారు.

### రేపు విజయ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో విజయ దుర్గాలమ్మ అమ్మవారు

**అల్లిపురం:** జెండా చెట్టు వీధిలో వెలసిన శ్రీ విజయ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 22వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీంట్లో భాగంగా 21వ తేదీ బుధవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టి, అమ్మవారి పుట్టబంగారం తీసుకు రానున్నట్లు తెలిపారు. 22వ తేదీన అమ్మవారి ఆలయంలో దుర్గా హోమం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి అమ్మవారి పండగ ఘనంగా చేపడుతున్నట్లు తెలిపారు.

### వేడుకగా జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినోత్సవం



కేక్ కట్ చేసిన ఎన్‌టీఆర్ వీరాభిమాని గంగరాజు తదితరులు

**దాబాగార్డెన్స్:** అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం జూనియర్ ఎన్‌టీఆర్ జన్మదినోత్సవం నగరంలోని 30, 36, 37 వార్డుల అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు ఆహ్వానం మేరకు ఎన్‌టీఆర్ వీరాభిమని గంగరాజు చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు మణివర్మ, బాబి, ఢిల్లీశ్వరరావు, మాడుగుల సత్యనారాయణ, చొక్కాకుల రాంబాబు, పలువురు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### రామజోగయ్య శాస్త్రికి సత్కారం



సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రిని సత్కరిస్తున్న వ్యాసశర్మ

**అగనంపూడి:** సిరివెన్నెల సీతారామ శాస్త్రి స్మారక పురస్కారం అందుకోవడానికి విశాఖ విచ్చేసిన సినీగేయ రచయిత రామ జోగయ్య శాస్త్రికి విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆలిండియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మాల వ్యాసశర్మ, అనకాపల్లి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్, ప్రతినిధి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# పాపం.. పాతనగరం

- నివాస ప్రాంతాలు జలమయమై వన్‌టౌన్ విలవిల
- ఎళ్లకేళ్లుగా ఇదే పరిస్థితి అని స్థానికుల ఆవేదన
- రామకృష్ణానగర్, లక్ష్మీనగర్, ప్రసాద్‌గార్డెన్స్‌లో ఇళ్లలోకి ప్రవేశించిన వర్షం నీరు



వరుసగా రెండు రోజులు కురిసిన వర్షానికి వర్షం నీటితో నిండిపోయిన జ్ఞానాపురం రైల్వే వంతెన పరిసరాలు



జనతాబజార్ వద్ద దుకాణాల ముందు నిలిచిపోయిన వర్షం నీరు



పూడిక తీయక చెత్తతో నిండి పోయిన కెనాల్



జలమయమైన వన్‌టౌన్ ప్రధాన రహదారి

**జగదాంబ:** ఆదివారం ఒక మోస్తరుగా కురిసిన వర్షం, సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జాము వరకు భారీ ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి ప్రజలు సేదదీరారు. ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది.

**నీట మునిగిన రహదారులు..**

మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి పాతనగరంలో రహదారులు నీట మునిగాయి. పోర్టు దరి హార్బర్ స్టేషన్ వద్ద రహదారి వర్షపు నీటితో నిండిపోయింది. రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్ రోడ్డు, జనతాబజార్ రహదారి, బౌడారా రోడ్డు, పూర్ణామార్కెట్, వెలంపేట ఇలా అన్ని రహదారులు మోకాళ్ల లోతు నీళ్లతో నిండిపోయాయి. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. వాహనాలు నీటిలోనే ఉండిపోయాయి.



జ్ఞానాపురంలోని రైల్వే వంతెన వద్ద వర్షం నీటిలో ప్రయాణిస్తున్న వ్యక్తి

**ఇళ్లలోకి వర్షం నీరు..**

ఈ వర్షం వల్ల ఎండల నుంచి ఉపశమనం పొందామన్న ఆనందం కన్నా ఎక్కడి నీరు అక్కడ నిలిచిపోయి, వర్షం నీరు ఇళ్లలోకి వచ్చి స్థానికులు ఇబ్బంది పడ్డారు. రామకృష్ణానగర్, లక్ష్మీనగర్ వీధులు, ప్రసాద్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లో మంగళవారం వేకువ జామున కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీళ్లు వచ్చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. పెద్దాచిన్నా అంతా కలిసి ఇళ్లలోకి వచ్చిన నీటిని తోడి బయట పారబోశారు. దీనివల్ల వారికి రాత్రంతా నిద్ర లేకుండా పోయింది. పూర్ణామార్కెట్ లోతట్టు ప్రాంతం కావడంతో జగదాంబ, కేజీహెచ్ వంటి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు ఇక్కడికి చేరుతోంది. అలాగే జనతాబజార్ కూడా ఏపాటి వర్షం వచ్చినా నీళ్లు దుకాణాల్లోకి వెళ్లిపోవడంతో స్క్రాప్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. వారి సామగ్రి అంతా నీటిలో మునిగిపోతుంటుంది. చిరు వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతుంటారు. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి అదే జరిగింది.

**నాటి నుంచి ఇదే దుస్థితి..**

ఎన్నేళ్లయినా పాతనగరం పరిస్థితి మారలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు కాలువల ద్వారా ప్రవహించి కెనాల్ ద్వారా సముద్రంలో కలవాల్సి ఉంటుంది. కానీ పోర్టు లోపలి నుంచి ఉన్న కెనాల్‌లో పూడిక తీత వంటి పనులు చేయక పోవడం వల్ల కెనాల్ అంతా మూసుకుపోతుంటుంది. దీనివల్ల వర్షం నీరు, చెత్తా చెదారం నిల్వ ఉండిపోయి పరిసర ప్రాంతాలన్నీ జలమయం అయిపోతుంటాయి. చిలకపేట, రామకృష్ణానగర్, వెలంపేట, లక్ష్మీనగర్ వంటి ప్రాంతాలు ఎప్పటి నుంచో ముంపునకు గురవుతుంటాయి. ప్రతి ఏటా జీవీఎంసీ అధికారులు పరిశీలిస్తున్నారు కానీ పరిష్కార చర్యలు మాత్రం తీసుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకుని కెనాల్లో పూడిక తీత పనులు చేయించాలంటున్నారు. లేని పక్షంలో వచ్చే వర్షాకాలం అంతా తామంతా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వేడుకుంటున్నారు.



ఎల్వీసీ కూడలిలోని నైట్ ఫుడ్ కోర్టు వద్ద వర్షపు నీటిలో చెత్తా చెదారం

## హనుమత్ జయంతికి ఆలయాలు సిద్ధం



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల ప్రసన్న ఆంజేయస్వామి ఆలయం



వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం

**అల్లిపురం:** ఈ నెల 22న హనుమత్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ ఆలయంలో వేంచేసిన ప్రసన్న ఆంజజేయ స్వామి ఆలయం, సౌత్ జైలురోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయం, వెంకటేశ్వరమెట్టపై గల అభయాంజనేయస్వామి దేవాలయం, అచ్చియ్యమ్మపేటలో గల అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం తెల్లవారు జాము నుంచే పూజలు, విశేష అభిషేకాలు, హోమాలు, తమలపాకుల పూజ, వడమాలలతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని చోట్ల అన్నసమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఘనంగా బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామ దేవత పోలమాంబ

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బంగారమ్మ పండగ..**

ఈ నెల 18న ప్రారంభమైన పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు మంగళవారం అనుపు మహోత్సవంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, 20న ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో గరిడీలు, పులివేషాలు, తప్పిటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్‌హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**పోలమాంబ పండగ..**

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు జరిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆదిఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసుల ఆరాధ్య దైవంగా పోలమాంబను ఆరాధిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి చదునుపట్టు (ఆర్టీ క్లబ్ గొల్లలపాలెం) నుంచి ధూప దీప నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పిటగుళ్లు, చెక్కభజన, పులివేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 27వ తేదీన మారువారం జరపనున్నారు.

## ట్రాలర్ నుంచి జారిన ఐరన్ షీట్ రోల్



జారిపడ్డ ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

**అక్కిరెడ్డిపాలెం:** ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్ లారీ నుంచి మంగళవారం వేకువ జామున ఐరన్ షీట్ రోల్ జారి పడింది. ఆ సమయంలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోకలు సాగకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. శీలానగర్ నుంచి ఆటోనగర్ లోపలకు ట్రాలర్‌పై ఐరన్ షీట్ రోల్స్ వెళ్తున్నాయి. సరిగ్గా ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి మలుపు తిరుగుతున్న ట్రాలర్‌పై నుంచి రోల్ రోడ్డు మధ్యలో పడిపోయింది. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వెంటనే ఐరన్ షీట్ రోల్‌ను క్రేన్ సహాయంతో తొలగించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఇలా జరిగింది. రోల్ అవ్వకుండా చైన్‌తో కట్టడం, ఐరన్ బెల్టులతో బిగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ వీటిని తరలించేటప్పుడు కింద రోల్ అవ్వకుండా చెక్కలు, ఇతర దిమ్మలు లాంటి వాటిని తూతూ మంత్రంగా పెట్టి తరలిస్తుంటారు. వీటిపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

## వీధి విక్రయదారుల నమోదు తప్పనిసరి

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ జోన్-3 పరిధిలోని వీధి విక్రయదారులు వారి వివరాలు తప్పనిసరిగా ఈ నెల 23లోగా నమోదు చేసుకోవాలని జోన్-3 జోనల్ కమిషనర్ కె. శివప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్-3 పరిధిలో ప్రస్తుతం ఉన్న వీధి విక్రయదారులు, కొత్త వీధి విక్రయదారులు తప్పనిసరిగా వారి వివరాలు స్థానిక సచివాలయం వార్డు వెల్ఫేర్ కార్యదర్శి వద్ద ఈ నెల 23లోగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సర్వే ద్వారా ప్రస్తుతం ప్రభుత్వం అందించే పథకాలు వీధి విక్రయదారులకు అందుబాటులోకి వస్తాయని, సర్వేలో నమోదైన వారికి వెండింగ్ కార్డు, వెండింగ్ సర్టిఫికెట్ ప్రభుత్వం అందిస్తుందని, ఇది వీధి విక్రయదారులకు గుర్తింపు పత్రంగా పని చేస్తుందన్నారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు సత్కారం

**అగనంపూడి:** యూనియన్ బ్యాంక్ అగనంపూడి శాఖ సీనియర్ మేనేజర్‌గా గుడివాడ సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ బ్రాంచి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆమెను ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ సంస్థ అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు ఘనంగా సత్కరించారు.

## అనాథ బాలలకు అన్నదానం



అనాథ బాలలకు అన్నం వడ్డిస్తున్న బాలు భార్గవ్

**కంచరపాలెం:** సినీ నటుడు, నిర్మాత మంచు మనోజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మంగళవారం వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలు భార్గవ్ ఆధ్వర్యంలో 104 ఏరియాలో కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో అనాథ బాలలకు అన్నదానం చేసి, నిత్యావసర సరుకులు అందజేశారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనాథలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా బాలు భార్గవ్ మాట్లాడుతూ వైజాగ్‌లో ఫ్యాన్స్ వందల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న విడుదలయ్యే భైరవం సినిమా సూపర్ హిట్ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెమినీ గణేష్, దాడి వెంకటేష్, అనిల్, శంకర్, ఎల్లాజీ, పవన్, సతీష్, ప్రసాద్, అభిమాలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పరదేశమ్మ పండగ



పరదేశమ్మ అమ్మవారి ప్రతిమలతో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

**అల్లిపురం:** స్థానికుల ఆరాధ్య దైవం, అమ్మవారి వీధిలో వెలసిన కొత్తమ్మ వారి నెల రోజుల పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పరదేశమ్మవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలతో భక్తులు తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పాత జైలురోడ్డు నుంచి డప్పు వాయిద్యాలతో భక్తులు అల్లిపురం మెయిన్‌రోడ్డు, కుమ్మర వీధి, అమ్మవారివీధి తదితర ప్రాంతాల్లో తిరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన కొత్తమ్మవారి ఉజ్జిడి బండి గ్రామంలో తిరిగే కార్యక్రమం, 26న పుట్ట బంగారం, 27న అమ్మవారి ఘటాలు గ్రామంలో తిరుగుతాయని, 31వ తేదీన సత్తెమ్మ వారి పండగ, జూన్ 4వ తేదీన మరిడమ్మ అమ్మవారి పండగ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జూన్ 2వ తేదీన కొత్తమ్మవారి తొలేళ్ల ఉత్సవం, 3వ తేదీన కొత్తమ్మవారి ప్రధాన పండగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## హోటల్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**పెదగంట్యాడ:** మండలంలోని సిద్దేశ్వరం రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో మంగళవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో హోటల్ యాజమాన్యంతో పాటు సిబ్బంది, కొనుగోలుదారులు భయంతో పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు స్పందించారు. సకాలంలో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

## జూలై 9న దేశవ్యాప్త సమ్మె



భెల్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** దేశంలో ఉగ్రదాడులు, కొన్ని రాష్ట్రాల్లో యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సమ్మె జూలై 9కి వాయిదా పడినట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. భెల్ ప్రధాన గేటు ఎదుట మంగళవారం అఖిలపక్షం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణ నిలుపుదల చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26000 చెల్లించాలనే డిమాండ్స్‌తో దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. గుర్తింపు యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవీఎస్ రాజు, సీతన్నాయుడు, అల్లు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.